వరద హోరు..

- పొంగిపొర్లుతున్న వాగులు
- నిండుతున్న చెరువులు


మోత్కూరు : పొడిచేడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

అడ్డగూడూరు : ఆలుగు పోస్తున్న ధర్మారం గ్రామ చెరువు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 1 : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. యాదగిరిగుట్టలోని నల్ల చెరువు, వంగపల్లి ఎక్క చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. చొల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మల్లాపురం వాగు నిండిపోగా చెక్ డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలోని బాలికల సంక్షేమ హాస్టల్‌లో చెట్లు విరిగిపడ్డాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ మున్సిపల్ సిబ్బందితో విరిగిన చెట్లను, డ్రైనేజీల్లో చెత్తను తొలగించారు.

ఆలేరు రూరల్ : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో జనజీవనం స్తంభించింది. వ్యాపార సముదాయాలు మూసివేశారు. దినసరి కూలీలు, వ్యవసాయ కూలీలు ఇండ్లకే పరిమితమయ్యారు. మండలంలోని కొలనుపాకలో పీతాంబరం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 13వ వార్డు నీట మునిగింది.

ఆత్మకూరు(ఎం) : భారీ వర్షాలు, ఈదురు గాలులకు కప్రాయపల్లి, రహీంఖాన్‌పేట, తుక్కాపురం గ్రామాల్లో రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోయాయి. వాటిని ఎస్ఐ కృష్ణయ్య, పోలీసులు తొలగించారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొరిపిరాల, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రవహిస్తున్న బిక్కేరు వాగును తాసీల్దార్ రవికుమార్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు పరిశీలించారు.

మోటకొండూర్ : మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరుతున్నాయి. పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండల కేంద్రంలోని కట్టు కాల్వ ద్వారా ఊర చెరువులోకి వర్షపు నీరు చేరుతుంది. సికిందర్‌నగర్, కాటేపల్లి, ఇక్కుర్తి వాగులు ప్రవహిస్తున్నాయి. కాటేపల్లిలో రోడ్డు ధ్వంసమైంది. తాసీల్దార్ శాంతిలాల్ వాగులు, చెరువులను పరిశీలించి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పట్టణంలోని పర్రె కాల్వ వద్ద రోడ్డుపై వరద ప్రవహిస్తుంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

మోత్కూరు : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి మండలంలోని పొడిచేడు వద్ద వరద ప్రవాహం మరింతగా పెరిగింది. మున్సిపాలిటీ కేంద్రంలో ప్రధాన రహదారిపై వరద నీటితో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మండలంలో 110 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జామచెట్లబావిలో చేతికి వచ్చిన రెండు ఎకరాల వరి పంట నేలపాలైంది. పత్తి చేలల్లో వర్షం నీరు నిలిచింది.

అడ్డగూడూరు : మండలంలోని ధర్మారం గ్రామంలో బిక్కేరు వాగులో చెక్‌డ్యామ్ అలుగుపోసింది. ధర్మారం, అజీంపేట చెరువులు మత్తడి దుంకుతున్నాయి.

బీబీనగర్ : మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. మండలంలోని రుద్రవెల్లి గ్రామం నుంచి ప్రవహిస్తున్న మూసీ వరదను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పోచంపల్లి, బీబీనగర్ మండలాల ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వరద ఉధృతి పెరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భూదాన్ పోచంపల్లిలో పర్రె కాల్వ వద్ద వరద ప్రవాహం

యాదగిరిగుట్ట : బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న చొల్లేరు వాగు

రామన్నపేటలో ఇంటిపై ఒరిగిన స్తంభం

ఆత్మకూరు(ఎం) : తుక్కాపురం రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

మోత్కూరులో నేలకొరిగిన వరి పంట

ఆత్మకూరు(ఎం) : కప్రాయపల్లి ప్రధాన రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు

రామన్నపేట : సుంకెనపల్లి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు

అడ్డగూడూరు : ఆలుగు పోస్తున్న అజీంపేట చెరువు

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా సాగింది. ఆదివారం ఉదయం ప్రధానాలయంలోని మొదటి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ నారసింహ హవనం నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.37,65,700 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

జనసేన సైనికుల గిరిప్రదక్షిణ

సెప్టెంబర్ 2న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదినం పురస్కరించుకుని వరంగల్ జిల్లాకు చెందిన జనసేన సైనికులు ఆదివారం యాదగిరిగుట్టలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులు పవన్‌కళ్యాణ్‌పై ఉండాలని వేడుకున్నారు. వారికి జనసేన పార్టీ జిల్లా నాయకుడు మామిడాల రమేశ్ స్వాగతం పలికారు.

చేనేత వస్త్రాల కొనుగోలుకు ప్రభుత్వం కృషి

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 1 : సహకార, సహకారేతర రంగాల్లో నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను 30శాతం కొనుగోలు చేసి కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతన్నకు చేయూత పథకానికి ప్రభుత్వం ఒకేసారి రూ.90 కోట్లు విడుదల చేస్తున్నదని, ఈ నిధులతో 38,133 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందుతారని తెలిపారు. చేనేత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో భూదాన్ పోచంపల్లిలో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. రైతుల మాదిరిగానే చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మలకు విన్నవించానని చెప్పారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వల నిర్మాణానికి రూ.450 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అనంతరం జూలూరు – రుద్రవెల్లి లో లెవల్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల, పట్టణ అధ్యక్షులు పాక మల్లేశ్‌యాదవ్, భారత లవకుమార్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : డీఈఓ

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఈఓ నర్సింహ, మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 1 : జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యాధికారి కానుగుల నర్సింహ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, కేఏబీ కృష్ణారావు, మంజుల పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి : డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ఆండాలును సన్మానించిన వైద్యులు, వైద్య సిబ్బంది

రామన్నపేట, సెప్టెంబర్ 1 : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పక ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన మునిపంపుల పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ ఆండాలుకు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, బంధువులు, స్నేహితులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36 సంవత్సరాలు వైద్య వృత్తిలో ఎలాంటి రిమార్క్ లేకుండా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓలు వసంతకుమారి, గోపాల్, సీహెచ్‌ఓ చంద్రకళ, సూపర్‌వైజర్ వాణిశ్రీ, మల్లేశ్, శ్రీనివాస్, కొండల్‌రావు, చంద్రయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి

భువనగిరి తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : సీపీఎస్–యూపీఎస్ విధానాలను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో భువనగిరి తాసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షన్ విద్రోహ దినం నిరసన ప్రదర్శన చేపట్టారు. భారీ వర్షంలో గొడుగులు, నల్లని దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధన కోసం టీజీ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ, టీజీఓ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం నాయకులు డి. భగత్, ఎండీ ఖదీర్, ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు, చిత్తరంజన్‌రెడ్డి, కవిత, లింగ అరుణమ్మ, కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ఆర్. ఆనందం. జీవీ రమణారావు. జి. బాలయ్య, పెండెం శ్రీను, విజయ్, జ్ఞాన ప్రకాశ్ రెడ్డి, బాలమణి, కౌశిక్, సుదర్శన్, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

ఉత్తమ రైతు పురస్కారానికి వెంకటేశ్వర్‌రెడ్డి ఎంపిక

రాజాపేట, సెప్టెంబర్ 1 : మండలంలోని నెమిలె గ్రామానికి చెందిన రైతు మేక వెంకటేశ్వర్‌రెడ్డి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపికైనట్లు ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్ఐఎ పంప్స్ సౌజన్యంతో యాంత్రిక విభాగంలో ఎంపికైన వెంకటేశ్వర్‌రెడ్డికి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 3న అవార్డుతోపాటు రూ.10వేల నగదు, ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటికి గోదావరి జలాలు అందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మోత్కూరు, సెప్టెంబర్ 1 : విషపూరితమైన మూసీ నీటితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, వాటికి బదులుగా గోదావరి జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. మండలంలోని పాలడుగులో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ పదో మహాసభలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల కాలుష్యం, వ్యర్థాల వల్ల మూసీ నీరు కలుషితమైందని, ఆ నీటితో భూసారం దెబ్బతిన్నదని అన్నారు. కలుషితమైన నీటిని తాగిన మూగజీవాలు, ప్రజలు రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్వాపురం ప్రాజెక్టు ద్వారా వలిగొండ చెరువును మినీ రిజర్వాయర్ చేసి వెల్వర్తి, పల్లెర్ల, కూరెళ్ల మీదుగా పాలడుగు చెరువులోకి గోదావరి జలాలను తరలించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, అసిఫ్‌నెహర్ కాల్వల పూర్తికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దడిపల్లి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశ్, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు యాదగిరి, ముత్తయ్య, చంద్రయ్య, యాదగిరి, గంగయ్య, సైదులు, మాధవి, నవనీత, కవిత పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

విద్యార్థికి చెక్కు అందజేస్తున్న టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రమేశ్

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 1 : పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థి బేతి జగదీశ్ ఎంబీబీఎస్ విద్య కోసం టీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ తడక రమేశ్ ఆదివారం రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. జగదీశ్ విద్యకు అయ్యే ఖర్చులు, హాస్టల్, పుస్తకాలు, ఫీజుల కోసం వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందులను గమనించి సహాయం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకొని పేదలకు సహాయ పడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వలందాసు ప్రవీణ్, బోగ నర్సింహ, కడవేరు హనుమంతు, దామోదర్, శివ, సత్యనారాయణ, మనోహర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

రాజాపేట : జాల గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

రామన్నపేట : వెల్లంకిలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

తుర్కపల్లి, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంతోపాటు ఇబ్రహీంపురం గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని ప్రదర్శనగా వెళ్లి పోచమ్మ, దుర్గమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కోళ్లు, యాటలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజాపేట : శ్రావణ మాసం చివరి ఆదివారం పలు గ్రామాల్లో బోనాల పండుగ జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య బోనాలతో ప్రదర్శనగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని నల్ల పోచమ్మ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా ఆదివారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలు, ఒడి బియ్యం, బోనాలు సమర్పించారు. వర్షంలోనూ మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో వచ్చారు. అమ్మవారికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పూజలు చేశారు.

తుర్కపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మదర్సా విద్యార్థి అదృశ్యం

మొయినొద్దీన్ (ఫైల్)

రామన్నపేట, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంలోని దారుల్ ఉలూం హుసేనియా మదర్సాలో చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అక్బర్‌బాగ్, మలక్‌పేటకు చెందిన మహ్మద్ మొయినొద్దీన్ ఖాన్ (20) ఆగస్టు 18న రామన్నపేట మదర్సాలో చేరాడు. ఆగస్టు 30న సాయంత్రం 3:30గంటల సమయంలో మదర్సా ఉపాధ్యాయుడు సయీద్ అన్వర్ దవాఖానకు వెళ్లి వచ్చి అసర్ నమాజ్ సాయంత్రం 5గంటల సమయంలో చూడగా మొయినొద్దీన్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొయినొద్దీన్ 5.10 అడుగుల ఎత్తు, చామనఛాయతో ఉంటాడని, మదర్సా నుంచి వెళ్లేటప్పుడు గోధుమ రంగు లాల్చీ, తెల్లని ఫైజమా ధరించాడని తెలిపారు. ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బీబీనగర్, సెప్టెంబర్ 1 : బీబీనగర్ – ఘట్‌కేసర్ మండలాల మధ్య రైలు పట్టాలపై గాయాలతో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భువనగిరి రైల్వే జీఆర్పీ ఇన్‌చార్జి కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సుమారు 42సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి బీబీనగర్ – ఘట్‌కేసర్ మండలాల మధ్య 223/23–25 మైలు రాయి వద్ద రైలు పట్టాలపై తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. 108 అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి వద్ద హైదరాబాద్‌లోని మూసాపేట్ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ప్రయాణించిన టికెట్ లభించిందని, అతని వద్ద వివరాలేమీ లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు నీలం రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించాడని చెప్పారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచామని, ఎవరైనా గుర్తిస్తే 9484222169, 8712658619 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం అమ్మితే చర్యలు : సీఐ

చౌటుప్పల్ రూరల్ : మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మన్మథకుమార్ అన్నారు. పట్టణంలోని బెల్టు షాపులపై ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. మద్యం అమ్ముతున్న వంకాయలపాటి రామకృష్ణ కిరాణా షాపును సీజ్ చేసి ఆరున్నర లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

బొమ్మలరామారం : పెద్దపర్వతాపూర్ చౌరస్తా వద్ద రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు

బొమ్మలరామారం, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని శామీర్‌పేట్ వాగు ఉధృతి పెరుగడంతో బండకాడిపల్లి నుంచి మునిరాబాద్ గ్రామానికి వెళ్లే రోడ్డును ఆదివారం మూసివేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాలు, విద్యుత్ స్తంభాలు, చెట్లకు దూరంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. పెద్దపర్వతాపూర్ చౌరస్తా వద్ద గాలి వానకు చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో పోలీస్ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో ఎంపీఓ మాలిని, జోజి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి : ఎంపీడీఓ

అనాజీపూర్ – రావిపహాడ్ తండాల మధ్య నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే బయటకు రావాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని నందనం – నాగిరెడ్డిపల్లి కల్వర్టు, బొల్లెపల్లి, అనాజీపూర్ – రావిపహాడ్‌తండా కల్వర్టులపై నీటి ప్రవాహాన్ని ఎంపీఓ దినకర్‌గౌడ్‌తో కలిసి ఆదివారం పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలన్నారు. చెరువులు, వాగుల్లో ఈత కొట్టడానికి, చేపలు పట్టేందుకు వెళ్లవద్దని సూచించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులను, గ్రామ పంచాయతీ స్థాయిలో ఒక అధికారిని అందుబాటులో ఉంచామని తెలిపారు. మండల స్థాయిలో పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారుల సమన్వయంతో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు.

నీటి ప్రవాహాలకు దూరంగా ఉండాలి : తాసీల్దార్

గుండాల, సెప్టెంబర్ 1 : భారీ వర్ష సూచన నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ జలకుమారి అన్నారు. ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసినందున ప్రజలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దన్నారు. ప్రవహిస్తున్న వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, కరెంటు స్తంభాలను తాకవద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని కోరారు.

జిట్టా కోలుకోవాలని అభిమానుల పాదయాత్ర

యాదగిరిగుట్టకు పాదయాత్రగా వెళ్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి అభిమానులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు ఆదివారం భువనగిరి రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణారెడ్డి త్వరగా కోలుకోవాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి తన సర్వస్వం దారపోసి తెలంగాణ, యాస, భాష, అస్థిత్వాలకు ఊపిరిపోసిన పోరాట నాయకుడు బాలకృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిట్టా అభిమానులు తోటకూరి వెంకటేశ్‌యాదవ్, వల్లందాస్ ఆదినారాయణ, బెల్లి చంద్రశేఖర్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్య